అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- పెసర్లంకలో గడప గడపకు మన ప్రభుత్వం



గ్రామంలో సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి నాగార్జున, పక్కన బాపుడా చైర్మన్ దేవినేని

పెసర్లంక(భట్టిప్రోలు): దేశ చరిత్రలోనే ప్రజలకు ఇచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. భట్టిప్రోలు మండలం పెసర్లంకలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి నాగార్జున, బాపుడా చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావుతో కలసి పాల్గొన్నారు. ప్రజలను మంత్రి ఆప్యాయంగా పలకరించారు. మంత్రి నాగార్జున గడప గడపకు వెళ్లి ఆయా కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల వల్ల చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. దీనికి సంబంధించిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. సంక్షేమ పథకాల అమలు తీరును అధికారులు, ప్రజా ప్రతినిధులు అర్హులకు అందేవిధంగా కృషి చేయాలన్నారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందచేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీయేనన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో 513 గృహాలను ఆయన సందర్శించారు. ఈ గ్రామంలో 450 మంది లబ్ధిదారులు రూ. కోటి లబ్ధి పొందారన్నారు. తొలుత గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ వేములపల్లి వెంకటేశ్వరరావు, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీటీసీ సభ్యుడు నన్నెపాముల చంటి, ఉప సర్పంచ్ నరేంద్ర వెంకట సుబ్బారావు, చింతమోటు సర్పంచ్ గుమ్మడి శంకరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దేవభక్తుని నాగవీర బసవయ్య, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, భట్టిప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుమ్మడి సాంబశివరావు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు మల్లిపెద్ది రామలింగేశ్వరరావు, చిలుమూరు రామమోహన్‌రావు, నన్నెపాముల శివకుమార్, కొల్లి రమేష్ చౌదరి, దాసరి ఏసుపాదం, దావూరి నామల్లేశ్వరరావు, తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు పుష్పలత, గణేష్, ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వలంటీర్లకు ఇంటర్వ్యూలు



చెరుకుపల్లి: మండలలోని రెండు గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న రెండు వలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించినట్లు ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో గూడవల్లి-1 రాంబొట్లవారి పాలెం -1 వలంటీర్ పోస్టులకు ముగ్గురు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా బుధవారం జరిగిన ఇంటర్వ్యూకు ఇద్దరు మాత్రమే హాజరయ్యారని తెలిపారు, ఎంపికై న అభ్యర్థుల తుది జాబితా త్వరలోనే ప్రకటించి వారికి నియామక పత్రాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ టి.నిరంజన్‌బాబు, ఇంచార్జ్ ఈఓపీఆర్‌డీ జి.మురళీకృష్ణ. కార్యదర్శి బి.విజియానంద్ పాల్గొన్నారు.

నేడు పాండురంగ స్వామి కల్యాణం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో కొలువైన రుక్మాబాయి సహిత పాండురంగ స్వామి దేవాలయంలో గురువారం స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు బుధవారం తెలిపారు. తొలి ఏకాదశి సందర్భంగా ప్రతి ఏటా స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలు కనుల పండుగగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి చాతుర్మాస్య వ్రత దీక్షలు

భట్టిప్రోలు: సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమములో గురువారం నుంచి చాతుర్మాస్య వ్రత దీక్షలు ప్రారంభం అవుతాయని పాలకవర్గ అధ్యక్షురాలు బూర్లె అరుణ కుమారి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం జ్యోతి ప్రజ్వలన, ఓంకార పతాకావిష్కరణ, భగవద్గీత పారాయణ, ఆధ్యాత్మిక ఉపన్యాసం, కర్పూర యజ్ఞం తదితర కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. గురువారం నుంచి ప్రారంభంకానున్న ఈ దీక్షలు నవంబర్ 23వ తేదీవరకు నాలుగు నెలల పాటు జరుగుతాయని తెలిపారు. ప్రతి నిత్యం ఓం నమో నారాయణాయ-అష్టాక్షరీ మంత్ర జపం రోజుకు 108సార్లు జరుగుతుందని పేర్కొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

బాపట్ల అర్బన్: బాపట్ల మండలం తూర్పు పిన్నిబోయినవారి పాలెంలో ఈనెల 24న పిన్ని బోయిన రామ కృష్ణ సహజ మరణం చెందారు. వారి కుటుంబానికి బుధవారం వైఎస్సార్ బీమా కింద రూ. 10వేలు అందజేశారు. పిన్నిబోయినవారి పాలెం పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, పిన్ని బోయిన సుందర్ సింగ్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, నరేన్, రామకృష్ణ, రజని, రాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ విజయలక్ష్మి, మహిళా పోలీస్ నాగలక్ష్మి, వలంటీర్ రవి, పాల్గొన్నారు.

వీఆర్ఏ కుటుంబానికి ఆర్థిక సాయం

కొల్లూరు: వృద్ధాప్య సమస్యలతో మృతి చెందిన వీఆర్ఏ ఖననానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం తరఫున బుధవారం అందజేశారు. మండలంలోని చిలుమూరు వీఆర్ఏగా బాధ్యతలు నిర్వహిస్తున్న గాలి కోటయ్య వృద్ధాప్యంతో బుధవారం తెల్లవారుజామున మరణించాడు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 15 వేలు ఆర్థిక సా యాన్ని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు అమిరిశెట్టి శ్రీధర్, వీఆర్ఓ జి.శ్రీరామ్, వీఆర్ఏల బృందం చేతుల మీదుగా మృతుడి భార్యకు అందజేశారు. కోటయ్య కుటుంబానికి సంతాపం తెలియజేశారు.

రోటరీ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ



బాపట్ల అర్బన్: స్థానిక విజయలక్ష్మీ పురంలోని రోటరీ కల్యాణ మండపంలో గతంలో ఎంపికకైన 99 మంది లబ్ధిదారులకు రోటరీ ఇంటర్నేషనల్, బాపట్ల రోటరీ క్లబ్ సౌజన్యంతో బుధవారం సైకిళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల అధ్యక్షుడు మోరిశెట్టి సుధీర్‌కుమార్, కార్యదర్శి బొమ్మిశెట్టి రాంబాబు, కోశాధికారి కోళ్లపూడి ఉపేంద్ర గుప్తా, క్లబ్ సీనియర్ సభ్యులు బూర్లె రామసుబ్బారావు, బొమ్మిశెట్టి శివ రామకృష్ణ, జిట్టా శ్రీనివాసరావు, కొల్లా శ్రీనివాసరావు, జూలకంటి వెంకట కృష్ణారావు, ఇ.హరిబాబు, తాళ్లూరి మల్లికార్జునరావు, పీవీ సత్యనారాయణ, ఎ.వెంకటేశ్వర రావు, బూర్లె అనిల్, పిన్నిబోయిన శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

విజేతలకు నగదు బహుమతులు ప్రదానం



విజేతలతో బ్యాంకు అధికారులు

బాపట్ల అర్బన్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు బాపట్ల పట్టణంలోని ఏబీఎం పాఠశాలలో బుధవారం నిర్వహించారు. పోటీలకు బాపట్ల జిల్లాలోని 25 మండలాల పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. పోటీల్లో కర్లపాలెం మండలం చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వై.సిరి, పి.శైలుశ్రీలు ప్రథమ స్థానాన్ని కై వసం చేసుకుని రూ. 10వేలు నగదు బహుమతి దక్కించుకున్నారు. అద్దంకి మండలం తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.వి.పార్థసాయి, ఎ.ఎస్.ఎస్ సూర్య తేజ రెండో బహుమతిగా రూ. 7,500 పొందారు. కొరిశపాడు మండలం రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.లలిత శ్రీ, జి.హర్షిత మూడో స్థానాన్ని సాధించి రూ.5వేలు నగదు బహుమతిని అందుకున్నారు. విజేతలను బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె.రామారావు అభినందించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శివకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ డి.వెంకటేశ్వర్లు, ఉప విద్యాశాఖ అధికారి ఎ.వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి ఎం.డి.సాధిక్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో లక్ష్మయ్య సేవలు ఎనలేనివి



డీసీఆర్‌బీ డీఎస్పీ జి.లక్ష్మయ్యను సత్కరిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్, అడిషనల్ ఎస్పీ పి.మహేష్

బాపట్లటౌన్: శాంతి భద్రతల పరిరక్షణలో డీసీఆర్‌బీ డీఎస్పీ లక్ష్మయ్య సేవలు ఎనలేనివని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. బాపట్ల డీసీఆర్‌బీలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ గుంటూరు ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీపై వెళ్తున్న జి.లక్ష్మయ్యకు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వీడ్కోలుసభను నిర్వహించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ కొత్త జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో లక్ష్మయ్య అందించిన సహకారం మరువలేనిదన్నారు. అంకితభావం, నిబద్ధత, కార్యసిద్ధితో విధులు నిర్వహించే వ్యక్తికి డీసీఆర్‌బీ బాధ్యతలు అప్పగిస్తారని, అలాంటి వారిలో ముందు వరుసలో లక్ష్మయ్య ఉన్నారన్నారు. విశేష అనుభవమున్న డీఎస్పీ బదిలీపై వెళ్లడం తీరని లోటని అడిషనల్ ఎస్పీ పి.మహేష్ తెలిపారు. బదిలీపై వెళ్తున్న కొత్త విభాగంలో కూడా అనుభవాన్ని ఉపయోగించి సమర్థవంతంగా విధులు నిర్వహించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఉద్యోగ బాధ్యతలతోపాటు పుస్తక పఠనంపై మంచి ఆసక్తి ఉన్న వ్యక్తి లక్ష్మయ్య అన్నారు. ఇప్పటికీ సుమారు 7 వేల పుస్తకాలు సేకరించి వాటిని విద్యార్థులు, యువకులకు అందజేసి వారిని పుస్తక పఠనం వైపు ఆకర్షించే కార్యక్రమాలు చేయటం విశేషం అన్నారు. అనంతరం పూలమాలలు, దుశ్శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. రేపల్లె, బాపట్ల, చీరాల డీఎస్పీలు టి.మురళీకృష్ణ, టి. వెంకటేశులు, ఎస్. ప్రసాద్ రావు, ఏఆర్ డీఎస్పీ ఎండీ ప్రేమ్‌కుమార్, ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌బీఐ చీఫ్ సేల్స్ మేనేజర్ రవీంద్రబాబు

కోనేటిపురం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం కోనేటిపురంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) భట్టిప్రోలు బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం బ్యాంక్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపాజిట్స్, రుణాలు, బీమా, మ్యూచువల్ ఫండ్స్, సాధారణ బీమా, పంట, బంగారు రుణాలు గూర్చి ఖాతాదారులకు వివరించారు. పంట, బంగారు రుణాలు సకాలంలో చెల్లించాలని కోరారు. మొండి బకాయిలు, సెటిల్‌మెంట్స్ గూర్చి చర్చించారు. సకాలంలో రుణాలు చెల్లించడం ద్వారా రాయితీలు పొందుతారని పేర్కొన్నారు. బ్యాంక్ మేనేజర్ కె.లింగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహనా సదస్సులో చీఫ్ సేల్స్ మేనేజర్ రవీంద్రబాబు, వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, వెలుగు కమ్యూనిటి కో-ఆర్డినేటర్లు రజని, హనోక్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమానికి పాటుపడిన డాక్టర్ పిరాట్ల



డాక్టర్ పిరాట్ల నారాయణమూర్తి ,చిత్రపటం వద్ద వివిధ రంగాల ప్రముఖుల నివాళి

తెనాలి: ఇటీవల మృతిచెందిన పట్టణానికి చెందిన విశ్రాంత ప్రొఫెసర్, శ్రీసీతారామ గానసభ అధ్యక్షుడు డాక్టర్ పిరాట్ల నారాయణమూర్తి సంతాపసభను బుధవారం చినరావూరు గోలీడొంకలోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణ సంక్షేమానికి అహర్నిశలు పాటుపడిన నారాయణమూర్తి, అటు సంగీత సేవను, దాతృత్వ కార్యక్రమానికి నిర్వహించారని సభకు అధ్యక్షత వహించిన తాడేపల్లి సూర్యనారాయణమూర్తి చెప్పారు. యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా ఆయన గైడ్‌గా 39 మంది డాక్టరేట్‌ను పొందినట్టు తెలిపారు. బ్రాహ్మణుల అపరకర్మల నిమిత్తం శాశ్వత భవనం ఏర్పాట్లుచేసి, విప్రధర్మస్థలి సంస్థను దీక్షతో నడిపిన ధన్యజీవిగా పేర్కొన్నారు. దుర్భా హరిబాబు శాస్త్రి మాట్లాడుతూ శ్రీసీతారామ గానసభకు నిధుల సేకరించి నిర్విఘ్నంగా సంగీత సేవను కొనసాగించిన సూర్యనారాయణమూర్తి గొప్ప కళాపోషకుడుగా చెప్పారు. ఆంధ్రాబ్యాంకు విశ్రాంత రీజినల్ మేనేజరు పరుచూరి సుబ్బారావు తన ప్రసంగంలో గానసభ అధ్యక్షుడిగా ఎందరికో సంగీతంపై అభిరుచిని కలిగించారని చెప్పారు. విప్రధర్మస్థలికి చేసిన సేవలను బీవీఎస్ శాస్త్రి వివరించారు. చీరాల చైతన్యభారతి కార్యదర్శి భాగి నారాయణశాస్త్రి, ప్రముఖ మృదంగ విద్వాంసుడు కానూరి వెంకట రామకృష్ణ తదితరులు మాట్లాడారు. తొలుత నారాయణమూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

చెరుకుపల్లి తహసీల్దార్‌గా బి.వెంకటేశ్వర్లు



చెరుకుపల్లి: చెరుకుపల్లి మండల తహసీల్దార్ బొల్లిపల్లి వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొన్నాళ్లుగా తహసీల్దార్ ప్రశాంతి బదిలీపై వెళ్లటంతో రేపల్లె తహసీల్దార్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు చెరుకుపల్లి తహసీల్దార్‌గా బదిలీ పై వచ్చారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తానని అన్నారు.

'జగనన్న సురక్ష' విజయవంతం చేయండి

పిట్టలవానిపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ షేక్ బాజి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం గురించి ఎంపీడీఓ భవనం మారుతీ శేషాంబతో కలిసి వివరించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా ప్రజలకు కావలసిన 11రకాల పత్రాలు, సర్టిఫికెట్‌లు, ప్రభుత్వ పథకాల సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈపథకం నిర్వహణకు మండలంలో రెండు బృందాలుగా మండల స్థాయి అధికారులు ఎక్కడికక్కడే క్యాంపులు నిర్వహించి తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. ఈవోపీఆర్డీ కె.పద్మజ ఉన్నారు.

నేడు బ్లడ్ కాంపోనెంట్స్ స్టోరేజ్ సెంటర్ ప్రారంభం

రేపల్లె: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బ్లడ్ కాంపోనెంట్స్ స్టోరేజ్ సెంటర్‌ను గురువారం ప్రారంభించనున్నామని బ్లడ్ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావుచేతుల మీదగా ప్రారంభమవుతుందని కార్యక్రమంలో వైద్యులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

హుండీ కానుకల ఆదాయం రూ.3.06 లక్షలు

తెనాలి: పట్టణంలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీరామేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. మొత్తం రూ.3,06,943లు వచ్చాయని ప్రకటించారు. స్థానిక గాడిబావి సెంటర్లోని శ్రీసీతారామస్వామివారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి వై.అమర్‌నాథ్ పర్యవేక్షణలో భక్తులు శ్రీనివాసరావు, కిశోర్, భక్తబృంద సభ్యులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ వీవీ రమణకుమారి, వ్యవస్థాపక ధర్మకర్తలు ఎస్‌బీ శివ, కె.భాస్కరరావు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్నివర్గాలు సంతోషం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

చెరుకుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం-1పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ముందుగా ఖాదర్ ఖాన్ సెంటరులోని అభయాంజనేయ స్వామివారి ఆలయంలో ఎంపీ మోపిదేవి నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ప్రతి ఒక్కరినీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ నవరత్నాల ద్వారా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని, ఇవ్వని మరికొన్ని హామీలను కూడా నెరవేర్చి ప్రజలు మనసు గెలుసుకున్న గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. జగనన్న పాలనలో ఎక్కడా దళారుల ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి వ్యక్తికి నేరుగా వారి వారి ఖాతాల్లో నగదు జమచేయటం జరుగుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు సిఫార్సు చేసిన వారికి, టీడీపీ నాయకులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందించారని గుర్తుచేశారు. జగనన్న సంక్షేమ పథకాలు పది కాలాల పాటు పేదలందరికీ అందాలంటే మరో మారు జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని, అందుకు అందరం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం చెరుకుపల్లి నాయీబ్రాహ్మణ సంఘ నాయకుడు బల్లేపల్లి పూర్ణచంద్రరావు, మరో 50మందిని ఎంపీ మోపిదేవి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, జడ్పీటీసీ సభ్యురాలు మరవాడ పావని బండారు రామారావు, పట్టణ కన్వీనర్ ఎల్లెల రవికిరణ్, మరివాడ ప్రసాద్, స్థానిక సర్పంచ్ దేవరకొండ వాణి, ఎంపీటీసీ సభ్యులు పాలపర్తి రాణి, నాగుల నరసింహారావు రావూరి ఆంజనేయులు, నందిపాటి సుబ్బారావు, బల్లేపల్లి పూర్ణచంద్రరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, కార్యదర్శి మురళి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సూర్యలంక తీరంలో మహిళ ఆత్మహత్యాయత్నం

సత్వరం స్పందించి కాపాడిన పోలీసులు

బాపట్లటౌన్: మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం సూర్యలంక తీరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గుంటూరు స్తంభాల గరువు సెంటర్‌లో నివాసం ఉండే మామిళ్లపల్లి రమాదేవి కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకొని చనిపోవాలనే ఉద్దేశంతో సూర్యలంక సముద్రతీరానికి వచ్చి, నీటిలో లోతుకు వెళ్లి పోతుండడంతో సూర్యలంక అవుట్ పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ గోపి గమనించాడు. వెంటనే గజ ఈతగాళ్లను అప్రమత్తం చేసి అందరు కలిసి ఆమెను ఒడ్డుకు తీసుకొని వచ్చి ప్రథమ చికిత్స చేయించారు. వెంటనే మెరుగైన చికిత్స కోసం బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించారు. మహిళను కాపాడిన పోలీస్ సిబ్బందిని, గజ ఈతగాళ్లను జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అభినందించారు.

పోక్సో కేసులో వ్యక్తి అరెస్ట్

బాపట్లటౌన్: మైనర్ బాలికను వేధిస్తున్న కేసులో వ్యక్తిని బుధవారం రూరల్ పోలీసులు అరెస్ట్‌చేసి కోర్టుకు హాజరు పరిచారు. మండలంలోని 6వ మైలు ఉప్పరపాలెం గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమపేరుతో వేధింపులకు గురిచేయడంతో గ్రామానికి చెందిన తన్నీరు వెంకటేష్‌పై పోక్సో కేసు నమోదు చేసి బుధవారం కోర్టుకు హాజరుపరిచామని డీఎస్పీ టి.వెంకటేశులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళకు తీవ్రగాయాలు



కర్లపాలెం: గుర్తు తెలియని వాహనం ఢీకొని మతి స్థిమితం లేని మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన కర్లపాలెం మండల పరిధిలోని యాజలి గ్రామం వద్ద మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య తెలిపిన వివరాల మేరకు పిట్టలవానిపాలెం మండలం పుచ్చకుర్తివారిపాలెం గ్రామానికి చెందిన మతి స్థిమితం లేని భాగ్యమ్మను యాజలి సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీ కొనటంతో తీవ్ర గాయాలయ్యాయన్నారు. తీవ్ర గాయాలైన భాగ్యమ్మను 108వాహనం సిబ్బంది గుంటూరు జీజీహెచ్‌కు తరలించారని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రైతు మహాధర్నాను విజయవంతం చేద్దాం

కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ములకా శివసాంబిరెడ్డి

కొల్లిపర: ఈనెల 30న విజయవాడలో అలంకార సెంటరులో జరిగే రైతు మహాధర్నాను రైతులు, కౌలు రైతులు భారీగా పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు ములకా శివసాంబిరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని దావులూరు, తూములూరు, హన్‌మాన్ పాలెంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది భారీ వర్షం కారణంగా ఖరీఫ్ రబీ సీజల్లో వరి, జొన్న , మొక్కజొన్న కౌలు రైతులకు పంట నష్టపరిహారం చెల్లించి, పంటల బీమా ఇవ్వాలన్నారు. నూటికి 70 శాతం ఉన్న కౌలు రైతులను ప్రతి బ్యాంకు వారు గుర్తించి వారికి కూడా బ్యాంకు రుణాలు ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో పాడి రైతులకు లీటరు పాలకు 4 రూపాయల బోనస్ ఇచ్చి 50 శాతం రాయితీతో గేదెలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముద్దన సాంబశివరావు, పేట శ్రీనివాసరావు, అద్దంకి నాగేశ్వరరావు, యేమినేని వెంకటేశ్వరరావు, కొల్లి కిరణ్‌రెడ్డి , మర్రెడ్డి బాపిరెడ్డి, శ్రీనివాసరావు, ఉపాల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భారత ఆర్థిక వ్యవస్థను స్థిరమైన గమ్యానికి చేర్చిన పీవీ

తెనాలి: భారతదేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్న కాలంలో ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తెలుగునేత పీవీ నరసింహారావు స్థిరమైన గమ్యానికి చేర్చిన మహనీయుడని బ్రాహ్మణ పరిషత్ నాయకులు స్మరించుకున్నారు. భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 102వ జయంతిని స్థానిక బోసురోడ్డులోని ఆయన విగ్రహం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర ఆపన్న ప్రదీపనా బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య గౌరవ సలహాదారు యనమద్రసాయి సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 1921లో సాధారణ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన పీవీ నరసింహారావు బహుభాషాకోవిదుడని గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సమర్థంగా పనిచేసి, భారతదేశానికి తొలి తెలుగు ప్రధానిగా దేశ పరిపాలనలో తనదైన ముద్ర వేశారని చెప్పారు. ఆర్థిక సరళీకరణ విధానాలను ప్రవేశపెట్టారని చెప్పారు. ఇంతటి మహనీయుడైన పీవీకి భారతరత్న ఇవ్వాలని సురేష్ కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఇదే వేదిక నుంచి సురేష్ దంపతులు త్రిపురాంతకంలో శతచండీయాగం నిర్వహిస్తున్న పట్టణానికి చెందిన విష్ణుబట్లవారికి రూ.2 లక్షల విలువైన ఆవు నెయ్యి, బియ్యం, దీక్షా వస్త్రాలను బ్రాహ్మణ పరిషత్ ద్వారా అందజేశారు. పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు పరాశరం వెంకట రామగోపాల్, పోతావఝుల పరుషోత్తమశర్మ, పెద్దిరాజు సత్యం, వంగల మాధవరావు, చెన్నాప్రగడ శ్రీనివాసరావు, దావులూరి శ్యాంసుందరశర్మ, చిలకలపూడి గోపాలకృష్ణ, మాగంటి వీఎస్ఆర్ శాస్త్రి, భాగవతుల రామకృష్ణ, దీవి శ్రీనివాసాచార్యులు, ఎస్ఆర్‌కే శర్మ, లక్కరాజు లక్ష్మణరావు, లక్కరాజు దుర్గ, పిసపాటి శివరామకృష్ణ శాస్త్రి, ప్రయాగ కృష్ణ, కావూరి సత్యనారాయణ, నేతి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను పరామర్శించిన ఎమ్మెల్యే శివకుమార్



తూములూరు(కొల్లిపర): దుగ్గిరాల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి ని బుధవారం తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ తూములూరు గ్రామంలోని శివరామకృష్ణారెడ్డి గృహంలో మర్యాద పూర్వకంగా కలిసి వయసు పైపడడం వల్ల ఆరోగ్యం సరిగా లేకపోవడం కారణంగా ఆయన ఆరోగ్యం ఎలా ఉంది అని విషయాలను అడిగి తెలుసుకున్నారు. శివరామకృష్ణారెడ్డి నూరేళ్లు ఆరోగ్యంగా ఉంటూ రాజకీయాల్లో తన అనుభవాలను తమ వంటి ఎమ్మెల్యేలకు తెలుపుతూ తమకు అండదండలుగా ఉండాలిని కోరారు.

108 వాహనంలో ప్రసవం



ఫిరంగిపురం: పురిటి నొప్పులు వచ్చిన గర్భిణిని 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలిస్తున్న క్రమంలో నొప్పులు ఎక్కువవడంతో వాహనంలో సిబ్బంది సుఖ ప్రసవం చేసిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం ప్రకారం అల్లంవారిపాలెం గ్రామానికి చెందిన పి.శ్రీలక్ష్మి గర్భిణికి తెల్లవారుజామున 1: 38 గంటల ప్రాంతంలో నొప్పులు రావడంతో గుంటూరు జీజీహెచ్‌కు కాన్పుకోసం తీసుకువెళ్లేందుకు 108వాహనానికి ఫోన్ చేశారు. దీంతో వాహన సిబ్బంది, శ్రీలక్ష్మి, మరో మహిళతో వైద్యశాలకు తీసుకు వెళుతుండగా అమీనాబాద్ మల్కాచెరువు ప్రాంతం వద్ద పురిటి నొప్పులు ఎక్కువవడంతో 108 వాహన సిబ్బంది (ఎన్ఎంటీ) సాగర్‌బాబు, పైలెట్ కుమార్‌లు గర్భిణికి సుఖ ప్రసవం చేశారు. అనంతరం వారిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థి ప్రతిభ



తెనాలిఅర్బన్: రాష్ట్ర స్థాయి తైక్వాండో సబ్ జూనియర్ పోటీల్లో అండర్ 41 కేజీల విభాగంలో బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం హైస్కూల్‌లో అయిదోవ తరగతి చదువుతున్న కె లారా సౌందర్య బంగారు పతకం సాధించిందని ప్రధానోపాధ్యాయులు పి రాము తెలిపారు. పోటీలను విజయనగరంలో ఇటీవల నిర్వహించినట్లు చెప్పారు. బుధవారం పాఠశాల ఆవరణలో విద్యార్థినిని అభినందించి మెమొంటో అందజేశారు. జోనల్ ఇన్‌చార్జి హృదయరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.